

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6.23 గురువారం సాయంత్రం
సహారి: 4.46 శుక్రవారం ఉదయం

భారీ దోపిడీకి స్కెచ్.. పోలీసుల చెక్! 7



అంతరిక్షం.. అద్భుతం!

7

భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ భూమిపై అడుగిడిన వేళ అమలాపురం రూరల్‌లోని సమనస లోని శ్రీరామా పబ్లిక్ స్కూలు విద్యార్థులు 'వెల్‌కం సునీత' అనే అక్షరాల రూపంలో కూర్చొని శుభాకాంక్షలు తెలిపిన దృశ్యం.
- అమలాపురం రూరల్



కాట్రేనికోనకు చెందిన ప్రముఖ చిత్రకారుడు అంజి ఆకొండి వాటర్ కలర్స్‌తో గీసిన సునీతా విలియమ్స్ చిత్రం.
- కాట్రేనికోన



సూరీడే.. సూరీడే..!

తెల్లవారుతుండగా ఉదయానికి ఆహ్వానం పలుకుతూ.. ప్రపంచానికి వెలుగు పంచుతూ.. గుడి గోపురానికి చుక్క పెట్టినట్టుగా ఏర్పడిన ఈ సూరీడు దృశ్యం సామర్లకోటలోని భీమేశ్వరస్వామి ఆలయంపై ఏర్పడింది.
-ఫొటో: ఆంధ్రజ్యోతి, కాకినాడ


ఆలివ్ రిడ్లే.. గుడ్లు.. గుడ్లే..





- సముద్ర తీరంలో విదేశాల నుంచి అలీవర్ రిడ్లే తాబేళ్ల ప్రవాహం
- ఇప్పటివరకు కాకినాడ, కోనసీమ జిల్లాలకు 675 తాబేళ్లు రాక
- జనవరి 18 నుంచి ఈ రెండు జిల్లాల్లో 74 వేల గుడ్లు పెట్టిన తాబేళ్లు
- కాకినాడ హోప్‌ఐలాండ్‌లో 27 వేల గుడ్లు పెట్టిన 225 తాబేళ్లు
- కోనసీమ జిల్లాలో 46 వేల గుడ్లు పొదిగిన 450 అలీవ్‌రిడ్లేలు
- ఒక్కో తాబేలు 120 చొప్పున గుడ్లు పొదుగుతున్న వైనం
- సముద్ర తీరాన గొయ్యి తీసి గుడ్లు పొదిగి ఇసుక కప్పేసి తిరిగి సముద్రంలోకి
- మొదలైన గుడ్ల నుంచి తాబేలు పిల్లల జననం.. రోజుకు 650 పిల్లలు బయటకు
- నక్కలు, కుక్కల బారి నుంచి రక్షించేందుకు అటవీ శాఖ హేచరీలు
- గతేడాది ఉమ్మడి జిల్లాలో 1.20 లక్షల గుడ్లు పొదిగిన అలీవ్‌రిడ్లే తాబేళ్లు





గుడ్లను సంరక్షిస్తోన్న అటవీశాఖ సిబ్బంది



గుంతలు తవ్వి గుడ్లు పొదిగిన తాబేళ్లు

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

అంతరించేపోయే జాబితాలో చేరిన అరుదైన అలీవ్‌రిడ్లే తాబేళ్లు మన సముద్ర తీర ప్రాంతానికి ఓ ప్రవాహంలా తరలివస్తున్నాయి. ఎక్కడెక్కడో వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీలంక.. థాయ్‌లాండ్.. ఇండోనేషియా దేశాల నుంచి సముద్రంలో వేల కిలోమీటర్లు ఈదుకుంటూ ఇక్కడకు సంతానోత్పత్తి కోసం బారులు తీరుతున్నాయి.. ఇప్పుడు కాకినాడ జిల్లాలోని హోప్ ఐలాండ్.. కోనసీమ జిల్లాలోని గోదావరి, సముద్రం కలిసే ప్రాంతాల్లో వేలల్లో గుడ్లు పెడుతున్నాయి. సంతానోత్పత్తికోసం అంతదూరం నుంచి వస్తోన్న ఈ తాబేళ్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఇప్పటివరకు పెట్టిన గుడ్లు ఎన్నో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే.. ఒక్కో తాబేలు సరాసరి 120 గుడ్ల చొప్పున జనవరి మూడో వారం నుంచి ఇప్పటివరకు ఏకంగా 74 వేల గుడ్లు పొదిగాయి. గుడ్లు పొదిగేసి ఆ వెంటనే తిరిగి సముద్రంలోకి వెళ్లిపోగా.. ఇప్పుడు ఆ గుడ్ల నుంచి రిడ్లే పిల్లలు బయటకు రావడం మొదలుపెట్టాయి. ఎక్కడో వేల కిలోమీటర్లు ఈదుకుని ఇక్కడ కొచ్చి గుడ్లు పొదిగి పిల్లలను చూడకుండానే వెళ్లిపోతున్న తాబేళ్లు ఆ గుడ్లను రక్షించేందుకు ఏకంగా గోతులు తవ్వి అందులో గుడ్ల పొదిగి ఎవరికి కనిపించకుండా ఇసుక కప్పేసి వెళ్లిపోగా.. ఇప్పుడు వాటి నుంచి రోజుకు వందలాది పిల్లలు బయటకు వస్తున్నాయి. దీంతో ఇప్పుడు సముద్రతీరంలో ఇవన్నీ సందడి చేస్తూ కనువిందు చేస్తున్నాయి. అటు అటవీ శాఖ అధికారులు ఈ గుడ్ల నుంచి క్షేమంగా పిల్లలు బయటకు వచ్చేలా అనేక రక్షణ చర్యలు తీసుకుంటుండడంతో ఈ ఏడాది ఆలివ్‌రెడ్లే తాబేళ్ల సంతానం భారీస్థాయిలో పెరుగుతోంది.

సందడే సందడి..

సముద్ర పర్యావరణాన్ని రక్షించడంలో ఎంతో కీలకమైన ఆలివ్‌రిడ్లే తాబేళ్లు ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోయే జాబితాలో ఉన్నాయి. ఈ తాబేళ్లలో ఏడు రకాల జాతులుండగా, ఐదు జాతులు జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో అధికం. అటు శ్రీలంక, థాయ్‌లాండ్, ఇండోనేషియా దేశాల్లోను అనేక జాతులున్నాయి. ఇప్పుడివి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సముద్ర తీరానికి వందల్లో ప్రయాణించుకుంటూ వస్తున్నాయి. ప్రధానంగా కాకినాడ హోప్‌ఐలాండ్, కోనసీమ జిల్లాలో ఐ.పోలవరం, అల్లవరం, అమలాపురం రూరల్ ప్రాంతాల్లోని సముద్ర తీరానికి తరలివస్తున్నాయి. దీంతో ఇప్పుడు ఎక్కడ చూసినా వీటి సందడే నెలకొంది. వీటి రాక జనవరి నెలాఖరు నుంచి మొదలవగా ప్రస్తుతం ఎక్కువ సంఖ్యకు చేరుకుంది. ఇలా వచ్చిన తాబేళ్లన్నీ కాకినాడ, కోనసీమ జిల్లాల్లో భారీగా గుడ్లు పొదుగుతున్నాయి. ఇప్పటివరకు అటవీశాఖ అధికారుల అంచనా మేరకు కాకినాడ జిల్లాకు 225, కోనసీమ జిల్లాకు 450 తాబేళ్లు వచ్చినట్టు గుర్తించారు. ఇవి ఇప్పటివరకు మొత్తం 74 వేల గుడ్లు పొదిగాయి. ఇది భారీ సంఖ్యగానే భావించాలి. కాకినాడ జిల్లాలో హోప్‌ఐలాండ్‌కు ఇప్పటివరకు 225 తాబేళ్లు రాగా, 28వేల గుడ్లు పొదిగాయి. కోనసీమ జిల్లాలో 450 తాబేళ్లు 46వేల గుడ్లు పొదిగినట్టు గుర్తించారు. దీంతో ఈ రెండు జిల్లాల తీర ప్రాంతాల్లో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సందడి భారీగా ఉంది. వాస్తవానికి ఈ గుడ్లను తాబేళ్లు సముద్రతీరాన ఇసుకలో 30 నుంచి 45 సెంటీమీటర్ల లోతున కుండాకారంలో గుంతలు తీస్తాయి. వాటిలో గుడ్లను పొదుగుతాయి. ఒక్కో తాబేలు సరాసరి 120 వరకు గుడ్లను పొదుగుతాయి. ఆ వెంటనే గుడ్లపై ఇసుకను కప్పేసి తిరిగి తాబేళ్లు తమ గమ్యస్థానానికి వెళ్లిపోతాయి. ఆ తర్వాత 40 రోజుల ఆ తర్వాత ఆ గుడ్ల నుంచి తాబేళ్లు పొదుగుతాయి. ఈలోపు 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రత ఎండ వేడిమి ఉంటేనే గుడ్ల నుంచి పిల్లలు బయటకు వస్తాయి. ఇప్పుడు హోప్‌ఐలాండ్‌తోపాటు కోనసీమ జిల్లాలో వాసాలతిప్ప, ఎస్.యానాం, గచ్చకాయల పోర, నీళ్ల రేవు తదితర ప్రాంతాల్లో వేలల్లో ఉన్న గుడ్లను అటవీశాఖ సంరక్షిస్తోంది. తాబేళ్లు పెట్టే గుంతలను ఇన్సిటివ్‌గా పిలిచే అటవీశాఖ వాటి చుట్టూ ప్రస్తుతం నెట్‌లు కట్టి రక్షిస్తోంది. లేదంటే కుక్కలు, నక్కలు ఈ గుడ్లను తినేసే ప్రమాదం ఉంది. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న గుడ్లను అటవీశాఖ కాకినాడ జిల్లాలో రెండు, కోనసీమ జిల్లాలో ఐదుచోట్ల హేచరీల కింద ఒకేచోటకు తెచ్చి సంరక్షించడంతో దీంతో ఈ దఫా గుడ్ల సంరక్షణ మెరుగైంది.

పిల్లలు బయటకొస్తున్నాయి..

ఆలివ్‌రిడ్లే తాబేళ్లు ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో కాకినాడ, కోనసీమ జిల్లాలకు 675 వరకు రాగా, 90 శాతం తాబేళ్లు గుడ్లు పెట్టి వెళ్లిపోయాయి. ఇప్పుడు 40 రోజుల వ్యవధి దాటడంతో ఆదివారం నుంచి పిల్లలు పొదుగుతున్నాయి. రోజుకు ఉమ్మడి జిల్లాలో 780 వరకు పిల్లలు బయటకొస్తున్నాయి. ఇవి పుట్టిన 12గంటల్లో తిరిగి సముద్రంలోకి వెళ్లిపోతున్నాయి. వాస్తవానికి అరుదైన జాతికి చెందిన ఆలివ్‌రిడ్లే తాబేళ్లలో ఆడా, మగా పుట్టుక పూర్తిగా ఉష్ణోగ్రతపైనే ఆధారపడనున్నాయి. గుడ్లు పొదిగిన తర్వాత 28 నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే 40 రోజుల తర్వాత మగ తాబేళ్లు, ఉష్ణోగ్రత 30 నుంచి 32 మధ్య ఉంటే ఆడ తాబేళ్లు బయటకు వస్తాయి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ఆడతాబేళ్ల పిల్లలు అధికంగా బయటకు వస్తున్నాయి. కాకినాడతో పోల్చితే కోనసీమ జిల్లాలో పిల్లలు అధికంగా ఉత్పత్తి అవుతున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మరోపక్క ఈనెలాఖరు వరకు రానున్న తాబేళ్లు మరికొన్ని గుడ్లను పొదగనున్నాయి. ఈనెల దాటితే విదేశాల నుంచి ఆలివ్ రిడ్లే తాబేళ్ల రాక పూర్తిగా ఆగిపోనుంది.

ఇక్కడకే ఎందుకంటే..

ఆలివ్ రిడ్లే తాబేళ్లకు ఓ ప్రత్యేకత ఉంది. అవి ఎక్కడైతే గుడ్ల నుంచి పిల్లలుగా బయటకు వచ్చాయో అదే ప్రాంతానికి పెద్దయ్యాక తిరిగి సంతానోత్పత్తికి వస్తాయి. ఇందులోభాగంగా కాకినాడ జిల్లాలో హోప్ ఐలాండ్, కోనసీమ జిల్లాలో కొన్ని తీరప్రాంత మండలాలకు తరలివస్తున్నాయి. గతంలో ఉప్పాడ తీరానికి సైతం భారీగా వచ్చేవి. అక్కడ సముద్రతీరం కలుషితం కావడంతో ఇక్కడకు రావడం లేదు. వాస్తవానికి ఏటా వేలల్లో వచ్చే ఆలివ్‌రిడ్లే తాబేళ్లు కొన్నేళ్లుగా భారీగా తగ్గిపోయాయి. సముద్ర కాలుష్యం, వేట పడవులకు తగిలి, వలలో చిక్కుకుని భారీగా చనిపోతున్నాయి. దీంతో రెండేళ్లుగా సముద్రతీరంలో ఎక్కడ చూసినా వీటి కళేబరాలే కనిపిస్తున్నాయి. దీంతో అరుదైన జాతికి చెందిన వీటిని సంరక్షించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జిల్లా అటవీశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో తాబేళ్ల గుడ్లను ఇటీవల ఎక్కువగా సంరక్షిస్తున్నారు. సముద్రంలో ఆక్సిజన్ శాతం పెంచేందుకు, చేపల సంతానం వృద్ధి చెందేందుకు ఆలివ్ రిడ్లే తాబేళ్ల ఎంతగానో దోహదం చేస్తాయి. చేప పిల్లలను తిని జీవించే జెల్లీఫిష్‌లను తాబేళ్లు తినడంవల్ల చేపల ఉత్పత్తి పెరుగుతుంది. కాగా గతేడాది ఉమ్మడి జిల్లాలో ఆలివ్‌రిడ్లే తాబేళ్లు లక్షకుపైగానే గుడ్లు పొదిగాయి. కాకినాడ జిల్లాకు గతేడాది 420 తాబేళ్లు రాగా 32 వేల వరకు గుడ్లు పొదిగాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గతేడాది 850 వరకు తాబేళ్లు రాగా 91 వేల గుడ్లు పొదిగాయి.

ఒక ఎంపీపీ స్థానానికి, ఐదు ఉపసర్పంచ్ స్థానాలకు 27న ఎన్నికలు

- నోటిఫికేషన్ విడుదల

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 19(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఒక ఎంపీపీస్థానంతోపాటు ఐదు గ్రామపంచాయతీల్లో ఉపసర్పంచ్ స్థానాలకు ఈనెల 27న ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసింది. దీనిలో పెదపూడి మండలం రామేశ్వరం, తుని మండలం దొండవాక, సామర్లకోట మండలం పి.వేమవరం, తొండంగి మండలం పైడికొండ, ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామ పంచాయితీలు ఉన్నాయి. ఈఐదు చోట్ల వివిధ కారణాలవల్ల ఉపసర్పంచ్ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 27న ఉదయం 11గంటలకు పంచాయతీ సభ్యులు హాజరై ఉపసర్పంచ్‌ను ఎన్నుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈఎన్నిక నిమిత్తం ప్రత్యేక అధికారులను నియమిస్తున్నారు. కాకినాడ రూరల్ ఎంపీపీ స్థానం కొంత కాలంగా ఖాళీగా ఉంది. దీనికి కూడా 27న ఎన్నిక నిర్వహించనున్నారు.

హిందీ పరీక్షకు 27,186మంది హాజరు

కాకినాడ రూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బుధవారం జరిగిన పదోతరగతి హిందీ పరీక్షకు మొత్తం 27,394మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 27,186మంది విద్యార్థులు హాజరుకాగా 208మంది గైర్హాజరైనట్లు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. జిల్లాలో 142 కేంద్రాల్లో ఉదయం 9.30గంటలనుంచి 12.45 గంటల వరకూ పరీక్ష నిర్వహించగా జిల్లా పరిశీలకులు 8, డీఈవో 6, అసిస్టెంట్ కమిషనర్ 3, తనిఖీఅధికారులు 40 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కాకినాడ డివిజన్‌లో 16,414మంది, పెద్దాపురం డివిజన్‌లో 10,772మంది పరీక్ష రాశారన్నారు.

డీఆర్‌డీఏ పీడీగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాగ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పీడీగా జి.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా డ్వామా కార్యాలయంలో పరిపాలనాధికారిగా పని చేస్తున్న ఈయన్ను ఇక్కడ నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలో అన్ని కార్యకలా పాలను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ఉద్యోగులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

ఉపకార వేతనాలు రాలేదని హాల్‌టికెట్లు నిలుపుదల చేయవద్దు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 19(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాల మంజూరు కారణంగా విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు హాల్ టికెట్లు నిరాకరించడం, పరీక్షలు పాసైన విద్యార్థులకు ఉత్తీర్ణతా సర్టిఫికెట్ల జారీ నిలుపుదల చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని కలెక్టర్ షాన్‌మోహన్ కళాశాల యజమాన్యాలను సూచించారు. విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ ఉపకారవేతన పథకం పరిధిలో ఉన్న కళాశాలలు అన్నిటికి ఫీజురీయింబర్స్‌మెంట్ సొమ్మును నేరుగా విడుదల చేయడంతోపాటు దశలవారీగా పాత బకాయిలను చెల్లిస్తామన్నారు. హాల్‌టిక్కెట్ ఇవ్వకపోయినా, సర్టిఫికెట్లు ఆపినా సదరు కళాశాలలపై చర్యలు చేపడతామని, వాటి ధిక్కార ధోరణిపై ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్‌కు సూచిస్తామని స్పష్టం చేశారు.

తడి చెత్త, పొడి చెత్తతో... మున్సిపాలిటీలకు ఆదాయం

- మున్సిపల్ కమిషనర్‌లతో ఆర్డీ సమావేశం

ఏలేశ్వరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తడి, చెత్త, పొడి చెత్తను వేరు చేయడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, చెత్తను వేరు చేసి కంపోస్టు ఎరువును తయారు చేయడం ద్వారా మున్సిపాలిటీలకు ఆదాయం వస్తుందని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగనరసింహారావు అన్నారు. ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయంలో జిల్లాలోని మున్సిపాలిటీ, కార్పొరేషన్ కమిషనర్‌లు, మేనేజర్‌లతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్‌డీ మాట్లాడుతూ కాకినాడ మినహా మిగతా మున్సిపాలిటీల్లో కుక్కల నియంత్రణ కరువైందని, త్వరలో తునిలో కుక్కలకు శస్త్రచికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. వేసవిలో ప్రజలకు తాగునీరు ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైనచోట ప్రత్యేక ట్యాంకులు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. పురమిత్ర యాప్ త్వరలో ప్రవేశపెడుతున్నామని, దీనిద్వారా మున్సిపాలిటీలో సమస్యలను నేరుగా ప్రజలు యాప్ ద్వారా పరిష్కారం చేసుకోవచ్చన్నారు. ఈ యాప్ ద్వారా ఇంటి పన్ను చెల్లించుకోవచ్చన్నారు.

బీసీ రుణాల జాతర

- 22తో ముగియనున్న గడువు
- మీసేవాకేంద్రాల వద్ద దరఖాస్తుదారుల తాకిడి

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

బీసీ రుణాల జాతర మొదలైంది. ఈనెల 11న కూటమి ప్రభుత్వం బీసీ రుణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈనెల 22తో గడువు ముగియనుంది. దీంతో మీసేవా కార్యాలయాలవద్ద దరఖాస్తుదారుల తాకిడి అధికంగా ఉంది. 21 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సున్న వారు వీటికి అర్హులు. బీసీ ఉపకులాలు, ఈడబ్ల్యూఎస్, ఈబీసీ, కాపు కులాలవారికి చేయూతనందించేందుకు.. వారు స్వశక్తితో ఆర్థికంగా బలపడేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

బీసీలకు సంబంధించి..

స్వయం ఉపాధి పథకం(వ్యక్తిగతంగా)లో భాగంగా ఏదైనా యూనిట్ పెట్టుకునే వెసులుబాటు ఉంది. వారికి అనుకూలమైన వ్యాపారాన్ని చేసుకోవచ్చు. యూనిట్ కాస్ట్ రూ.2లక్షలుంటే.. అందులో రూ.75 వేల వరకు సబ్సిడీ ఉంటుంది. అదే రూ.3లక్షలైతే రూ.1.25 లక్షలు సబ్సిడీ, రూ.5లక్షలైతే రూ.2లక్షల సబ్సిడీ ఉంటుంది. దీనికి 21 నుంచి 60 ఏళ్ల వయస్సున్న వారు అర్హులు.. ఇప్పటివరకు ఈ పథకానికి సంబంధించి బీసీ కార్పొరేషన్ 3201 దరఖాస్తులు వచ్చాయి.

బీసీల్లో డీఫార్మసీ, బీఫార్మసీ చదివిన నిరుద్యోగులు ఎవరైనా ఉంటే వారికోసం జనరిక్ మెడిసిన్ పేరుతో రుణాలు అందిస్తున్నారు. ఇందులో వీరు మెడికల్ షాపు పెట్టుకోవచ్చు. వీరి పేరున ఏమెడికల్‌షాపులు ఉండకూడదు. రూ.8లక్షల వరకు రుణం అందిస్తే.. అందులో రూ.4లక్షల సబ్సిడీ, రూ.4లక్షలు బ్యాంకులోను చెల్లించాలి. ఇప్పటివరకు జనరిక్‌కు పది దరఖాస్తులందాయి.

మేదర, కుమ్మరి, శాలివాహన వారికి వారి చేతి వృత్తుల ద్వారా ఆర్థికంగా బలోపేతమయ్యేలా స్వ యం ఉపాధి పథకాలు అమలు చేస్తున్నారు. ఇందులో బుట్ట అల్లిక, కుండల తయారీదారులకు ఈపథకం వర్తిస్తుంది. ఈకులాల్లో ముగ్గురు కలిసిస్తే యూనిట్‌కు రూ.3లక్షలవరకు రుణం అందిస్తారు. రూ.1.50లక్షలు సబ్సిడీ.

ఈడబ్ల్యూఎస్ వర్గాలకు..

ఈడబ్ల్యూఎస్ ఆర్థికంగా వెనుకబడిన తరగతులు(ఆర్యవైశ్య, కమ్మ, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ), ఈబీసీకి చెందిన 307కులాలవారికి స్వయం ఉపాధి పథకంలో భాగంగా యూనిట్‌కాస్ట్ రూ.2లక్షలుంటే.. అందులో రూ.75 వేలవరకు సబ్సిడీ ఉంటుంది. రూ.3లక్షలైతే రూ.1.25లక్షలు సబ్సిడీ, రూ.5లక్షలైతే రూ.2లక్షల సబ్సిడీ ఉంటుంది. దీనికి 21 నుంచి 60 ఏళ్ల వయస్సున్న వారు అర్హులు.

కాపు కులాల వారు..

స్వయం ఉపాధికి సంబంధించి 1119 దరఖాస్తులు వచ్చాయి. వీరు వ్యక్తిగతంగా రూ.2 లక్షలు, 3లక్షలు, రూ.5లక్షల యూనిట్ కాస్ట్ పెట్టుకోవచ్చు. అందులో 50శాతం సబ్సిడీ ఉంటుంది. దీనికి కూడా 21 నుంచి 50 వయస్సు వారు అర్హులు. వీళ్లల్లోనే గ్రూపు ఎంఎస్ఎంఈ కాపు బలిజ, తెలగ, ఒంటరి, వీళ్లు ముగ్గురి నుంచి ఐదుగురు గ్రూపుగా ఏర్పడి రూ.25లక్షల యూనిట్ కాస్ట్‌తో వ్యాపారం చేసుకోవచ్చు. ఇందులో రూ.పది లక్షల సబ్సిడీ, రూ.10లక్షలవరకు బ్యాంకులోను, రూ.లక్ష చొప్పున రూ.5లక్షలు లబ్ధిదారు వాటాగా వేసుకోవాలి.

మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ ఇచ్చి..

పేదింటి మహిళల స్వయం ఉపాధికి ఉచిత కుట్టు మెషీన్ల పంపిణీ, శిక్షణ కోసం ప్రభుత్వం ఉచిత కుట్టు మెషీన్ల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టి దరఖాస్తులను స్వీకరిస్తోంది. 18 నుంచి 50 ఏళ్ల వయస్సుకలిగిన మహిళలు ఈ పథకానికి అర్హులు. నియోజకవర్గానికి 3వేల చొప్పున మెషీన్లు అందించనున్నారు. ప్రస్తుతం బీసీ, ఈడబ్ల్యూఎస్ కులాల వారు అర్హులుగా ప్రకటించింది. గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం, మండలాలు, మున్సిపాలిటీల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. 45, 60, 90 ఇలా మూడు విధాలుగా శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తయ్యాక మెషీన్ అందజేస్తారు.

అంతరిక్షం.. అద్భుతం!

అంతరిక్షం గురించి తెలుసుకోవాలని ఎంతో మందికి ఆసక్తి ఉంటుంది. అంతుచిక్కని, అద్భుతమైన విషయాలపై దృష్టిపెట్టి బుర్రకు పదును పెట్టాలని అనుకుంటూ ఉంటారు. అయితే భారతదేశ సంతతికి చెందిన సునీతా విలియమ్స్ అంతరిక్షానికి వెళ్లి తిరిగి వస్తున్నారని తెలిసి ఎంతోమంది సంబరపడ్డారు. బుధవారం తెల్లవారుజామున ఆమె భూమిమీదకి వచ్చే క్షణాలను ఆస్వాదించడానికి ఉదయానే నిద్రలేచి టీవీలకు అతుక్కుపోయారు. ఆమె విజయమే తమ విజయంగా మురిసిపోయారు.



భూమి మీదకు సునీతా విలియమ్స్ రాకతో ప్రజల్లో ఆనందం

సర్వత్రా ప్రశంసలు

2028లో ఇస్రో ఆధ్వర్యంలో..
భారతీయ అంతరిక్ష కేంద్రం నిర్మాణం

యాళ్ల శివప్రసాద్, ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త



శివప్రసాద్

అమలాపురం రూరల్ మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అంతరిక్షంలో ఎన్నో ప్రత్యేకతలున్నాయి. భూమికి వంద కిలో మీటర్ల పైవరకు వాతావరణం ఉంటుంది. ఇక ఆ పైన అంతా అంతరిక్షమే. అక్కడ ఆక్సిజన్ అనేది ఉండదని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మానవాళి జీవించేందుకు ఉపయోగపడేలా అనువైన ప్రాంతాలను గుర్తించడానికి అంతరిక్ష పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ప్రధానంగా మైక్రో గ్రావిటీ మీద అంతరిక్షంలో ప్రయోగాలు చేస్తున్నారు. అంతరిక్ష పరిశోధనలపై ఎంతో ఆసక్తి ఉన్నా సునీతా విలియమ్స్ 8 రోజులు ప్రయోగాలు చేయడానికి వెళ్లి అనుకోని పరిస్థితుల్లో 9నెలల తర్వాత క్షేమంగా భూమికి తిరిగి రావడం విశేషం. ముందుగా వెళ్లిన ఐదుగురు వ్యోమగాములతోపాటు సునీతా విలియమ్స్, మరో వ్యక్తి అక్కడే ఉన్నారు. వారికి అవసరమైన ఆహార పదార్థాలను కార్గో స్పేస్ ద్వారా పంపిస్తారు. అంతరిక్షంలో ఉన్నవారికి స్పేస్ మెడిసన్స్ పేరిట ప్రత్యేకంగా మందులు ఉంటాయి. వారు అక్కడే ఉంటూ అంతరిక్షంతోపాటు ఇతర గ్రహాల మీద మనుషులు జీవించేందుకు వీలున్న ప్రాంతాలను గుర్తించడంతోపాటు అక్కడ లభించే ప్రకృతి సంపదలను గుర్తించేందుకు నిరంతరం ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. అమెరికా, రష్యా, జపాన్, యూరోపియన్ దేశాలతో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష సంస్థను అంతరిక్షంలో కట్టారన్నారు. అక్కడ నిర్మించిన స్పేస్ సెంటర్ అమెరికాలోని ఫుట్‌బాల్ క్రీడా ప్రాంగణమంత ఉంటుందని వివరించారు. భూమికి 400 కిలోమీటర్ల దూరంలో ఆ దేశాలు ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌ను నిర్మించాయన్నారు. స్పేస్ స్టేషన్ నిరంతరం భూమి చుట్టూ తిరుగుతూ ఉంటుంది. గంటకు 28వేల కిలోమీటర్ల వేగంతో భూమి చుట్టూ తిరుగుతుందని వివరించారు. ఒకసారి భూమి చుట్టూ స్పేస్ స్టేషన్ తిరిగి రావడానికి 90 నుంచి 92 నిమిషాల సమయం పడుతుందన్నారు అంత వేగంగా తిరిగితేనే స్పేస్ స్టేషన్ అంతరిక్షంలో ఉండగలుతుందని లేకపోతే పడిపోతుందన్నారు. అంతరిక్ష సంస్థ తరహాలోనే భారతదేశం ఇస్రో ఆధ్వర్యంలో స్పేస్ స్టేషన్ నిర్మాణానికి ఇప్పటికే సన్నాహాలు చేపట్టిందన్నారు. 2028 నాటికి స్పేస్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేసే అవకాశం ఉందని తెలిపారు. స్పేస్ స్టేషన్ నిర్మాణంలో భాగంగా డాకింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేసుకున్న దేశాల్లో నాల్గో స్థానాన్ని భారతదేశం దక్కించుకుందన్నారు. డాకింగ్ టెక్నాలజీలో భాగంగా పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్‌లో రెండు ఉపగ్రహాలను ఉంచి గతేడాది డిసెంబరు 30న అంతరిక్షంలో వదిలారన్నారు. ఉపగ్రహాల మధ్య దూరం 20 కిలోమీటర్లు ఉంటుందని, అవి ఒకదానికొకటి దగ్గరకు వచ్చి అనుసంధానం చేయడమే డాకింగ్ టెక్నాలజీ విశిష్టత అన్నారు. డాకింగ్ టెక్నాలజీ ఉంటేనే స్పేస్ స్టేషన్ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. భారతీయ వ్యోమగాములు త్వరలోనే అంతరిక్ష ప్రయోగాలకు ఇస్రో ఆధ్వర్యంలో బయలుదేరడం ఖాయమని శివప్రసాద్ స్పష్టం చేశారు.



సునీతా విలియమ్స్

సునీతా విలియమ్స్ అందరికీ స్ఫూర్తి : మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ సురక్షితంగా భూమిపై రావడం సంతోషకరమని, ఆమె నేటి యువతకు స్ఫూర్తి అని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. సునీతా విలియమ్స్ 59 ఏళ్ల వయస్సులో అంతరిక్ష పరిశోధనకు వెళ్లి సాంకేతిక లోపం కారణంగా 9 నెలలు అక్కడే ఉండాల్సిరావడంతో ఏమాత్రం మానసిక స్థైర్యం కోల్పోకుండా తిరిగి భూమికి క్షేమంగా చేరుకోవడం సామాన్య విషయం కాదన్నారు. సునీతా విలియమ్స్‌తో పాటు బుచ్‌విల్మోర్‌ను భూమిమీదకు తీసుకురావడానికి కృషి చేసిన అందరూ అభినందనీయులన్నారు.

మహిళలకు ఆదర్శం సునీతా విలియమ్స్



దివాన్‌చెరువు(ఆంధ్రజ్యోతి): రోదసి నుంచి భూమికి తిరిగి వచ్చిన సునీతా విలియమ్స్ నేటి మహిళలకు ఆదర్శం. ప్రతికూల పరిస్థితులను ఏవిధంగా జయించాలో తెలిపిన నింగి నుంచి నేలమీదకు వచ్చిన నిలువెత్తు రూపం. అంతరిక్ష యాత్రికురాలు సునీత, వ్యోమగామి బుచ్‌విల్మోర్ సహా నలుగురు 9నెలలపాటు అంతరిక్షంలో గడిపి భూమికి చేరుకోవడం హర్షణీయం. అంతరిక్ష పరిశోధనలో మరో చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుంది. ఎన్నిప్రతికూల పరిస్థితులు ఎదురైనా అధిగమించే స్ఫూర్తిని సునీతా విలియమ్స్ జీవితం నుంచి నేర్చుకోవాలి.

ఆచార్య ప్రసన్నశ్రీ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి

సునీతా విలియమ్స్ రోల్‌మోడల్



రాజమహేంద్రవరం అర్బన్(ఆంధ్రజ్యోతి): అంతరిక్షంలో జీరో గ్రావిటీ వాతావరణంలో జరిపే ప్రయోగాలకు వ్యోమగామి సునీతా విలియమ్స్ ప్రపంచ దేశాల అంతరిక్ష శాస్త్రవేత్తలకు రోల్‌మోడల్ కానున్నారు. ఆమె రాబోయే తరాలకు మార్గదర్శకం. 322 రోజుల 17 గంటలకు పైగా అంతరిక్షంలో గడిపి చరిత్ర సృష్టించడంతోపాటు రికార్డు బ్రేకింగ్ స్పేస్‌వాకింగ్ చేశారు. అంతరిక్షంలో దాదాపు 50 గంటల 40 నిమిషాలు స్పేస్‌వాక్ చేయడం ద్వారా అరుదైన ఘనత సొంతం చేసుకున్నారు. ఆమె ఎన్నో అంశాలను స్టడీ చేశారని భావిస్తున్నా, ఇవన్నీ భావి అంతరిక్ష పరిశోధకులకు ఎంతో ఉపయోగపడతాయి.

రామచంద్ర ఆర్‌కే, భౌతికశాస్త్ర పరిశోధకుడు, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, రాజమహేంద్రవరం

సునీతా విలియమ్స్ రాక ఎంతో ఆనందం



కోటనందూరు (ఆంధ్రజ్యోతి): సునీతా విలియమ్స్ భూమి మీదకి విజయవంతంగా తిరిగి రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఆమె 286 రోజులు అంతరిక్షంలో గడిపి అనేక పరిశోధనలు చేసి స్పేస్‌ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్స్ ద్వారా క్షేమంగా భూమికి చేరుకోవడం గొప్ప విషయమే. ఇది శాస్త్రసాంకేతిక రంగాల్లో మనిషి చేసిన ప్రగతికి అద్భుతమైన నిదర్శనం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిచ్చేలా ఉంది. సునీతా విలియమ్స్ వంటి శాస్త్రవేత్తలు మనదేశానికి ఉండడం గర్వకారణం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించేందుకు ఇలాంటి వ్యక్తులు మనకు ఆదర్శంగా ఉండాలి. భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుంది.

-ఎం.రామ్‌శేఖర్, ఎం‌ఈ‌వో2, ఫిజిక్స్ టీచర్, కోటనందూరు

తమిళనాడు తరహాలో..

ద్వారపూడిలో కావిళ్ల ఉత్సవం

కలశాలతో 500 మంది మహిళల ఊరేగింపు





నెత్తిపై కలశంతో యువతి, స్వామివారిని ప్రత్యేక వాహనంలో ఊరేగిస్తున్న స్వాములు

మండపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో బుధవారం కుమారస్వామివారి కావిళ్ల, కలశ ఉత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. తమిళనాడు తరహాలో ఇక్కడ ప్రతి ఏటా ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీ. దాదాపు 40 రోజులపాటు కుమారస్వామి మాలధారణ దీక్షను ఇక్కడి ప్రజలు చేపడతారు. గ్రామంలో ఉన్న స్వామివారి ఆలయం వద్ద దీక్ష తీసుకున్న స్వాములు కఠోర దీక్షతో పూజలు చేస్తుంటారు. 500 మంది మహిళలు కలశాలతో బయలుదేరుతారు. ఈ క్రమంలో బుధవారం జరిగిన కార్యక్రమానికి ద్వారపూడి పరిసర గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. అనంతరం గ్రామంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో విశేషపూజలు, జలాభిషేకాలు నిర్వహించారు. స్వామిని టీడీపీ మండలాధ్యక్షుడు యరగతపు బాబ్జీ, బీజేపీ నేత కోనా సత్యనారాయణ, ప్రముఖులు దర్శించుకున్నారు.



మండపేట మండలం ద్వారపూడిలో కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ముగిసిన ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండ్యూరన్స్ పోటీలు



హోరాహోరీగా జరుగుతున్న పోటీలు

గండేపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండ్యూరన్స్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారంతో ముగిశాయి. సీజన్-5లో భాగంగా ఈ పోటీలను నిర్వహించారు. వర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి హాజరయ్యారు. ఏపీ, తమిళనాడు రాష్ట్రాల నుంచి మొత్తం 13 టీమ్‌లు పాల్గొన్నాయి. ఇందులో విజేతగా రఘు ఇంజనీరింగ్ కాలేజీ (విశాఖ పట్నం), రన్నరప్‌గా ఎస్ఆర్‌కేఆర్‌కాలేజీ (భీమవరం) జట్లు గెలుపొందాయి. ముఖ్య అతిథిగా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ హెడ్ ఆఫ్ అడ్వాన్స్ ఇంజనీరింగ్ గ్రూప్ డాక్టర్ గంగారెడ్డి హాజరై జెండా ఊపి ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ విజేతలను డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విన్నర్‌కి రూ.75వేలు, రన్నర్‌కి రూ.50 వేలు, ఎండ్యూరన్స్ విన్నర్‌కి రూ.50వేలు, రన్నర్‌కి రూ.25వేలు నగదు బహుమతిని అందించారు. వైస్‌ఛాన్సలర్ డాక్టర్ ఎంబీ శ్రీనివాస్, ప్రొ వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జీ.సురేష్, ఎస్.భీమేశ్వరరెడ్డి, కే.నాగసురేష్, అడ్డూరి సీతారామమ్మూర్తి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువతికి వైద్యం

మానవత్వం చూపిన న్యాయమూర్తి



వివరాలు వెల్లడిస్తున్న జడ్జి కమలాదేవి

కాకినాడ క్రైం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేకుండా ఒంటిపై సగం దుస్తులు మాత్రమే కప్పుకుని తిరుగుతున్న ఓ యువతి గురించి తెలుసుకున్న ఓ జడ్జి మానవీయ కోణంలో స్పందించారు. ఆమె ఆదేశానుసారం ఆ యువతికి కాకినాడ జీజీహెచ్‌లో వైద్యం అందిస్తున్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్, మూడవ అదనపు జిల్లా కోర్టు జడ్జి పి.కమలాదేవి బుధవారం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 2రోజుల క్రితం తాను బయటకు వస్తుండగా మతిస్థిమితం లేకుండా ఒంటిపై సగం దుస్తులు మాత్రమే కప్పుకుని అక్కడక్కడా తిరుగుతున్న యువతిని చూశానని, ఆమె ఆచూకీ గమనించాలని తమ సిబ్బందితో పాటు పోలీసులకు తెలియజేశారన్నారు. బాధితురాలు సుమారు 10రోజులుగా నగరంలో ఈ విధంగా తిరుగుతోందని పోలీసులు తెలియజేయడంతో ఆశ్చర్యానికి గురయ్యానన్నారు. ఆమెకు మానసిక వైద్యం అందించాలని వైద్యులకు దిశ వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది తెలియజేయడంతో తాను ప్రత్యేకంగా రిసెప్షన్ ఆర్డర్ ఇచ్చానన్నారు. దీంతో బాధితురాలికి జీజీహెచ్‌లో వైద్యులు వైద్యం అందిస్తున్నారన్నారు. నగరానికి చెందిన ఆ యువతి వైద్య విద్యను అభ్యసించినట్టుగా విచారణలో తేలిందన్నారు. పూర్తి వివరాలు సేకరించిన అనంతరం ఆమెను ఇంటికి పంపిస్తామన్నారు. ఈ విధంగా మతిస్థిమితం లేక దుస్తులు లేకుండా తిరిగే యువతులు ఎంతో మంది ఉన్నారన్నారు. వారి పట్ల ఎంతో దయగా వ్యవహరించాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను ఉపయోగించుకుని అండగా నిలవాలని జడ్జి కమలాదేవి హితవు పలికారు.

భార్యను చంపిన భర్తకు జీవిత ఖైదు

రాజమహేంద్రవరం/ధవళేశ్వరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. ధవళేశ్వరం సీఐ టి.గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన దాడి గణేశ్ 2019లో తన భార్యకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ఆమెను చెక్క పీటతో కొట్టి, చాకుతో పొడిచి చంపేశాడు. దీనిపై మృతురాలి అన్నయ్య ఫిర్యాదుతో అప్పటి ఎస్ఐ వెంకయ్య, సీఐ బాలశౌరి కేసు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో గణేశ్‌కు జీవిత ఖైదు శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ ఐదో అదనపు జిల్లా జడ్జి డి.విజయ్ గౌతం తీర్పు చెప్పారు.

భార్యపెట్టిన కేసులతో మనస్తాపం చెంది భర్త ఆత్మహత్య

ఉండ్రాజవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భార్య భర్తపై పెట్టిన కేసులతో భర్త మనస్తాపం చెంది పురుగుమందుతాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని పాలంగి గ్రామంలో జరిగింది. ఉండ్రాజవరం ఎస్ఐ జి. శ్రీనివాసరావు బుధవారం తెలిపిన వివరాలు ప్రకారం.. పాలంగికి చెందిన ఉండ్రాజవరపు కిరణ్‌కుమార్ (47) విజయవాడకు చెందిన మంజుతో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. కొన్నేళ్ల తర్వాత ఉద్యోగం నిమిత్తం కిరణ్‌కుమార్ సింగపూర్ వెళ్లాడు. ఇండియాకు వచ్చినపుడు భార్యభర్తల మధ్య జరిగిన గొడవలు నేపథ్యంలో భార్య మంజు భర్త కిరణ్‌కుమార్‌పై 3 కేసులు పెట్టడంతో ఏడాదిక్రితం ఉద్యోగం మానేసి కోర్టులు చుట్టు తిరుగుతున్నారు. భార్య పెట్టిన కేసులకు మనస్తాపం చెంది మంగళవారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మృతుడి తండ్రి ఉండ్రాజవరపు సౌలురాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కె.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

భారీ దోపిడీకి స్కెచ్.. పోలీసుల చెక్!



విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న పిస్టల్స్, బుల్లెట్లు

- కాకినాడ జిల్లాలో తప్పిన భారీ దోపిడీ
- పోలీసుల చాకచక్యంతో నిందితుడి పట్టివేత
- 2 పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం
- నిందితుడు అంతర్‌జిల్లా పాత నేరస్తుడు
- కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

సర్పవరం జంక్షన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అతడో బ్యాంకు ఉద్యోగి. ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర చెడు వ్యసనాల కారణంగా పని చేసే బ్యాంకులో బంగారు ఆభరణాలు చోరీ చేసి నిందితుడిగా మారాడు. అప్పులు తీర్చేందుకు వేరేదారి లేక కష్టపడకుండా సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీల బాటను ఎంచుకున్నాడు. చిన్న చిన్న చోరీలు చేస్తే ప్రయోజనం లేదని ఏదైనా బ్యాంకు, ఏటీఎంలో చోరీకి పాల్పడి పెద్ద మొత్తంలో దోపిడీ చేస్తే జీవితంలో సెటిల్ అయిపోవచ్చనే దురుద్దేశంతో బీహార్ నుంచి 2 పిస్టల్స్ కొనుగోలు చేశాడు. చోరీకి రెక్కీలు నిర్వహిస్తోండగా మంగళవారం రాత్రి కాజులూరులో రెక్కీ నిర్వహిస్తోండగా కాకినాడ జిల్లా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి చాకచక్యంగా నిందితుడ్ని పట్టుకున్నారు. 2 పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి అరెస్ట్ వివరాలను బుధవారం సర్పవరం జంక్షన్‌లో గల కాకినాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

విశాఖపట్టణం మద్దిలపాలెం ఫిష్‌మార్కెట్ సమీపంలో గ్రూప్‌హౌస్‌లో చిటికెల నాగేశ్వరరావు, భార్య కుటుంబ సభ్యులతో కలసి నివాసం ఉంటున్నాడు. అతడు గతంలో పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో ప్రొబెషనరీ ఆఫీసర్‌గా పనిచేసేవాడు. ఈక్రమంలో ఆన్‌లైన్ బెట్టింగ్, చెడు వ్యసనాల కారణంగా బ్యాంకు నుంచి 900 గ్రాముల బంగారాన్ని బ్యాంకు నుంచి తనకున్న అధికారాన్ని దుర్వినియోగం చేసి సొంత అవసరాలకు వాడుకోవడంతో సస్పెండ్ చేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.40 లక్షలు బ్యాంకుకి కట్టేశాడు. అప్పులు తీర్చలేక, చెడు వ్యసనాలకు డబ్బుల్లేక చోరీల బాట పట్టాడు. చిన్న చోరీలతో జీవితంలో స్థిరపడటం సాధ్యం కాదని గ్రహించిన నాగేశ్వరరావు భారీ దోపిడీకి స్కెచ్ వేశాడు. బీహార్ ముంగర్ ప్రాంతానికి వెళ్లి 2పిస్టల్స్ 17 బుల్లెట్లు కొనుగోలు చేశాడు. దాంతో బ్యాంకు, ఏటీఎంల దోపిడీ చేసేందుకు విశాఖ సిటీ, రూరల్, నర్సీపట్నం, ఆంధ్ర, తమిళనాడు బోర్డర్‌లలో రెక్కీ నిర్వహించాడు. ఈ క్రమంలో నేరస్తుడు కాజులూరులో రెక్కీ నిర్వహిస్తున్నాడన్న పక్కా సమాచారంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం కాకినాడ జిల్లా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితుడ్ని పట్టుకుని, అతడి వద్ద నుంచి 2 పిస్టల్స్ 17 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. నిందితుడు అరెస్ట్‌తో భారీ దోపిడీని పోలీసులు నియంత్రించడం జరిగిందన్నారు. నిందితుడిపై నర్సీపట్నంలో 3 కేసులు, అన్నవరం, నక్కపల్లి, తాడేపల్లిగూడెం, ఏలేశ్వరం పీఎస్‌లో తలో ఓ కేసు వెరసి మొత్తంగా ఒక చైన్ స్నాచింగ్, 4 రాత్రి, పగలు చోరీలు, ఓ బైక్ చోరీ కేసులు ఉన్నట్టు తెలిపారు. నిందితుడ్ని చాకచక్యంగా పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన కాకినాడ రూరల్ సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఎస్ఐలు ఎంవీవీ రవీంద్రబాబు,ఎం.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పిల్లి రాజు!

యానాం జీఎంసీ బాలయోగి వారధిపై ద్విచక్రవాహనం గుర్తింపు

ద్రాక్షారామ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు గణపతినగరం వద్ద కన్నబిడ్డలను కాలువలోకి తోసి కుమార్తె కారుణ్య(7)మరణానికి కారకుడైన పిల్లి రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఈనెల 17న రాయవరం మండలం వెంటూరు గ్రామానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి పిల్లిరాజు తన కుమారుడు రామసందీప్, కుమార్తె కారుణ్యలను పాఠశాల నుంచి తీసుకువచ్చి గణపతి నగరం వద్ద ఇంజరం కాలువలోకి తోసేశాడు. అనంతరం మోటారు సైకిల్‌పై పరారయ్యాడు. ఘటనలో కుమారుడు రామసందీప్ ప్రాణాలతో బయటపడగా కుమార్తె కారుణ్య (7) మృతిచెందింది. అప్పటి నుంచి రామచంద్రపురం సీఐ ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎం.లక్ష్మణ్ సిబ్బంది బృందాలుగా పిల్లి రాజు ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. మంగళవారం పిల్లి రాజు ఆచూకీ ఎవరికైనా తెలిస్తే పోలీసులకు తెలియచేయాలని రాజు ఫోటో కూడా పోలీసులు విడుదల చేశారు. బుధవారం రాజు మోటారు సైకిల్‌ను యానాం జీఎంసీ బాలయోగి వారధిపై గుర్తించారు. దీంతో రాజు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడనే కోణంలో సీఐ ఎం.వెంకటనారాయణ, ఎస్ఐ ఎం.లక్ష్మణ్ పవర్‌బోట్లపై యానాం నుంచి సముద్ర తీర ప్రాంతం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం. రాజు పోలీసులకు లొంగిపోయాడా లేదా అరెస్టు చేశారా అన్నది గురువారం తెలియనుంది. పిల్లి రాజు సజీవంగా పోలీసులకు చిక్కడంతో ఈ ఘాతుకం వెనుక పూర్వాపరాలు పోలీసులు వెల్లడించే అవకాశం ఉంది.

మహిళ మెడలో గోల్డ్ చైన్ చోరీ

కొవ్వూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు మహిళ మెడలో ఆరున్నర కాసుల బంగారు చైన్ దొంగిలించుకుపోయిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరిగింది. కొవ్వూరు 23వ వార్డు, చిట్టూరివారి వీధికి చెందిన కుందుల పద్మకుమారి పట్టణంలోని ఏసిఆర్ లాడ్జి సమీపంలోని పాలింపాటి నరసయ్యనగర్‌లో బుధవారం సాయంత్రం వాకింగ్ చేస్తుంది. వెనుక నుంచి వచ్చిన వ్యక్తి మెడలో ఉన్న ఆరున్నరకాసుల బంగారు చైన్ తెంపుకుని బైక్‌పై దొమ్మేరు రోడ్‌లోకి వెళ్లిపోయాడని బాధితురాలు తెలియజేసింది. కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, సీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహనరావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించి సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.

డెల్టా కాలువలకు 10,700 క్యూసెక్కులు విడుదల

ధవళేశ్వరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువలకు 10,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 3200 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2వేల క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 5500 క్యూసెక్కులు చొప్పున సాగునీరు విడుదలవుతోంది. సీలేరు నుంచి విడుదలవుతున్న నీటితో కలిపి గోదావరిలో నీటి లభ్యత 10,551 క్యూసెక్కులుగా ఉంది. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10 అడుగులుగా నమోదయ్యింది.

గంజాయి కేసులో మైనర్ సహా ఐదుగురి అరెస్ట్

నిడదవోలు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి నిడదవోలులో గంజాయితో ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం నిడదవోలు పట్టణ పోలీస్‌స్టేషన్లో విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను సీఐ తిలక్ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ 18న మంగళవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ కాలనీ సమీపంలో కొందరు గంజాయి కలిగి ఉన్నారనే సమాచారంతో పట్టణ పోలీసులు దాడి చేసి ఐదుగురు యువకులు, ఒక మైనర్ బాలుడిని అరెస్ట్ చేశామన్నారు. పట్టణంలోని కుమ్మరవీధికి చెందిన దాసరి పృథ్వీ వెంకట సాయి నితీష్, జగనన్న కాలనీకి చెందిన గడిచుకోట భానప్రకాష్, చర్చిపేటకు చెందిన అక్కాబత్తుల బాలు, శింగవరం గ్రామానికి చెందిన మద్దాల భానుప్రకాష్, తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన పడాల భాగ్య శివ సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ కాలనీ చెందిన 17 ఏళ్ల మైనర్ బాలుడుని అరెస్ట్ చేసి వారి నుంచి సుమారు 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దాని విలువ సుమారు రూ.55,225 ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ దాడుల్లో పట్టణ ఎస్ఐ జీఎస్ ఆర్‌కె పరమహంస, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో లారీ డ్రైవర్ వీరంగం

రోడ్డుపక్క నిల్చున్న మహిళను, ఆగి ఉన్న ఆటోను లారీతో ఢీ

దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు



మద్యం మత్తులో ఉన్న లారీ డ్రైవర్‌ను కిందకు లాగి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు



వేళంగి పీహెచ్‌సీలో క్షతగాత్రురాలు బేబి

కరప, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో బుధవారం మధ్యాహ్నం మద్యం మత్తులో ఒక లారీ డ్రైవర్ వీరంగం సృష్టించాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామచంద్రపురం నుంచి కాకినాడ వైపు వెళ్తున్న లారీ వేళంగి వచ్చేసరికి అదుపు తప్పింది. స్థానిక నిత్యానందపురం సెంటర్ మలుపు తిరిగాక రోడ్డు పక్కన నిల్చున్న ఒక మహిళను, ఆగి ఉన్న ఆటోను, బజ్జీల బండిని లారీ డ్రైవర్ ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయే ప్రయత్నం చేశాడు. స్థానికులు వెంటపడి పట్టుకోగా డ్రైవర్ పూటుగా మద్యం తాగి మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. దీంతో చిర్రెత్తుకొచ్చిన పలువురు స్థానికులు డ్రైవర్‌ను కిందకు లాగి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పజెప్పారు. లారీ డ్రైవర్‌ను రామచంద్రపురానికి చెందిన రామకృష్ణ రాజుగా గుర్తించారు. ఈ ప్రమాదంలో కాజులూరు మండలం కుయ్యేరు గ్రామానికి చెందిన బండి బేబి గాయపడగా, ఆటో, బజ్జీల బండి ధ్వంసమయ్యాయి. క్షతగాత్రురాలికి వేళంగి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ తోట సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవుని సన్నిధిలో సీఐఎస్ఎఫ్ బృందం పూజలు

అన్నవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో బుధవారం కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్)సైకిల్ ర్యాలీ సభ్యులు సత్యదేవుని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు దగ్గరుండి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం పశ్చిమ రాజగోపురం వద్ద నుంచి ర్యాలీని ఈవో సుబ్బారావు జెండా ఊపి పునఃప్రారంభించారు. ఈ బృందం 25 రాష్ట్రాల్లో 358 యూనిట్లతో 2లక్షల మంది దేశం నలుమాలలా అంతర్గత పరిరక్షణలో పాత్ర పోషించడం అభినందనీయమని ఈవో పేర్కొన్నారు.



సత్యదేవుని దర్శనానంతరం సీఐఎస్ఎఫ్ బృంద సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఈవో

రేపు పిఠాపురంలో మినీ జాబ్ మేళా

పిఠాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కొండలరావు బుధవారం తెలిపారు. టీమ్ లీజ్, పేటీఎం, ఎల్‌ఐసీ కంపెనీల ప్రతినిధులు హాజరై ఎంపికలు జరుపుతారని చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి 19 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారు అర్హులు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ముందుగా https://naipunyam.ap.gov.in/ లో పూర్తి వివరాలతో రిజిస్టర్ కావాలని సూచించారు. జాబ్‌మేళాకు రెజ్యూమ్, ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 8639951441, 9949156583 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.



మంత్రి మనోహర్‌కు వినతిపత్రం ఇస్తున్న రెల్లి సంఘాల ప్రతినిధులు

'రెల్లి కులస్తులకు రెండు శాతం రిజర్వేషన్ కల్పించాలి'

పిఠాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రెల్లి కులస్తుల వెనుకబాటును గుర్తించి ఎస్సీ వర్గీకరణలో కనీసం రెండు శాతం రిజర్వేషన్ కల్పించాలని రెల్లి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం సభ్యులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్‌లను బుధవారం అమరావతిలోని సెక్రటేరియట్‌లో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వృత్తిపరంగా పడుతున్న అవమానాలు, ఎటువంటి అభివృద్ధికి నోచుకోని అంశాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. మంత్రులను కలిసిన వారిలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ బంగారు రమణకుమార్, పిఠాపురం రెల్లి సంఘాల నాయకులు బర్రంశెట్టి శ్రీనివాస్, అల్లం కిషోర్, సత్యమోహన్, న్యాయవాది బంగారు రామకృష్ణ ఉన్నారు.



బాణసంచా తయారీదారులకు సూచనలిస్తున్న ఏడీఎఫ్‌వో ఏసుబాబు

'బాణసంచా తయారీలో నిబంధనలు పాటించాలి'

కరప, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ, స్టోరేజీలో నిర్దేశించిన నిబంధనలను పక్కాగా పాటించాలని కాకినాడ జగన్నాయక్‌పూర్ ఫైర్‌స్టేషన్ ఏడీఎఫ్‌వో బి.ఏసుబాబు సూచించారు. మండలంలోని వేళంగిలో ఉమ్మడి తూర్పు గోదావరిజిల్లా బాణసంచా తయారీదారుల సంక్షేమ సంఘం బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బాణసంచా తయారీకేంద్రాల్లో భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని, పేలుడు మెటీరియల్‌ను మితంగా వాడాలని స్పష్టం చేశారు. అనంతరం సంఘ గౌరవాధ్యక్షుడు వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో కార్యవర్గంలోకి కోనసీమ జిల్లా ఉపాధ్యక్షుడిగా నామన దుర్గాప్రసాద్, తూర్పు గోదావరి జిల్లా ఉపాధ్యక్షుడిగా సయ్యద్ బాజిబేగ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి శ్రీనువాసు, కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు విన్నకోటి శ్రీనువాసు, కార్యదర్శి కొసన విజయకుమార్, ఉప కార్యదర్శి కింతాడ దుర్గారావు, కోశాధికారి గుంటముక్కల వీరవెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ రాజశేఖరాన్ని సత్కరిస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

విద్య, ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై చర్చ

కాకినాడ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ కాకినాడ జిల్లా కార్యవర్గ సమావేశం ఎస్టీయూ భవనంలో అధ్యక్షుడు మోర్తశ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కాశీవిశ్వనాథ్ నివేదిక సమర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ సమకాలీన విద్యారంగ, ఉపాధ్యాయ, ఉద్యోగవర్గ సమస్యలపై మాట్లాడారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరాన్ని గజమాలతో సత్కరించారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎన్.శివప్రసాద్, ఉపాధ్యక్షులు సీహెచ్ రాంబాబు, సత్యనారాయణరాజు, గోపాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు ఐడీ కార్డుల పంపిణీ

కాకినాడ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతాప్‌నగర్‌లో 41వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, బీజేపీ నాయకుడు గోడి వెంకట్ ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ సమావేశం నిర్వహించారు. అర్హులైన సీనియర్ సిటిజన్లకు ఐడీ కార్డులను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు పంపిణీ చేశారు. కార్డు కావాల్సిన వారు జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వై.మాలకొండయ్య, నాయకులు దువ్వూరి సుబ్రహ్మణ్యం, తుమ్మల పద్మజ, మాజీ కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్రసన్న, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.



ఐడీ కార్డులు అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

రెడ్‌క్రాస్ వృద్ధాశ్రమ సందర్శన

సర్పవరం జంక్షన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ వాకలపూడిలో ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని కలెక్టర్ షాన్‌మోహన్ బుధవారం సందర్శించారు. వృద్ధులకు అందిస్తున్న సదుపాయాలు, వసతి, ఆహారం వివరాలను రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు వివరించారు. కలెక్టర్ వృద్ధులతో ముచ్చటించి వారి బాగోగులు, ఆరోగ్యం, వసతిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాంబమూర్తినగర్‌లో నిర్వహిస్తున్న ప్రభుత్వ అంధుల ఆశ్రమం ప్రత్యామ్నాయ భవనాల పరిశీలనలో భాగంగా తిమ్మాపురంలో గ్రీన్‌ఫీల్డ్ అంధుల ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. కాకినాడ సిటీలోని పలు భవనాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట జడ్పీ సీఈవో రామ్‌గోపాల్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది వున్నారు.



వృద్ధులకు నమస్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

మూతిలేని పైపులు... వృథాగా పోతున్న తాగునీరు

కరప, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ వేసిన పలు కుళాయిల నుంచి రక్షిత మంచినీరు వృథాగా పోతోంది. ఇంటి ఆవరణలోని పైపుల్లో చాలా వాటికి ట్యాప్‌లను బిగించకపోవడంతో ఈ దుస్థితి దాపురించింది. కరప గ్రామంలోని కొత్తపేట రామాలయంవీధిలో పలు పైపుల నుంచి బుధవారం నిర్విరామంగా తాగునీరు బయటకు ఉబికి వచ్చి రోడ్లపై పారింది. అధికారులు స్పందించి ట్యాప్‌లు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.



కొత్తపేట రామాలయం వీధిలో వృథాగా పోతున్న రక్షిత మంచినీరు

పేదల ఆకలి తీర్చడం అభినందనీయం

కౌడా చైర్మన్ తుమ్మల బాబు, ఎమ్మెల్సీ రాజశేఖర్

పిఠాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే పేదల ఆకలి తీర్చేందుకు నిత్యాన్నదానాన్ని ప్రారంభించడం అభినందనీయమని పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, కౌడా చైర్మన్ తుమ్మల బాబు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి (సీహెచ్‌సీ)లో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆసుపత్రికి వచ్చే గర్భిణులు, రోగుల సహాయకులకు ఏర్పాటుచేసిన నిత్యాన్నదానాన్ని వారు బుధవారం ప్రారంభించారు. స్వయంగా ఆహార పదార్థాలు వడ్డించారు. ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ ఆశీస్సులతో, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో ఇటువంటి కార్యక్రమం చేపట్టిన సంస్థ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, చేయూత సంస్థ ఫౌండర్ మొండి రవికుమార్, కార్యదర్శి ఆలీమ్, చింతా పవన్‌కల్యాణ్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బొజ్జా కుమార్, వేణుం సురేష్, సంస్థ పిఠాపురం టీమ్ ప్రతినిధులు దయాసాగర్, సుంకర అనిల్, కట్టా నాగేశ్వరరావు, సియాదుల శ్రీమాన్‌నారాయణ, కాకి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రాజశేఖర్, కౌడా చైర్మన్ బాబు

ఆహార కల్తీ నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి

అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే నానాజీ



సర్పవరం జంక్షన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 'ఆహార పదార్థాల కల్తీతో ప్రజలు పలు రకాల రోగాలబారిన పడుతున్నారు. కారం, టీపొడి, పసుపు, పప్పులు, మంచినూనె నుంచి పాలు వరకు అన్నింట్లో వ్యాపారులు కల్తీకి పాల్పడుతున్నారు. ఆహార కల్తీ నియంత్రణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి' అని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. బుధవారం అసెంబ్లీలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఆహార కల్తీ, ప్రజారోగ్యం ముప్పుపై ఆయన మాట్లాడారు. హానికర రంగులు, పలు రకాల రసాయనాలను ఆహార పదార్థాల్లో కల్తీ చేయడంతో ప్రజలు ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాటు తనిఖీలు జరగకపోవడంతో కల్తీ మరింత తీవ్రస్థాయికి చేరిందన్నారు. జాతీయ క్రైం బ్యూరో నివేదిక ప్రకారం దేశంలోనే అధికంగా ఆహార పదార్థాలు కల్తీకి పాల్పడిన రాష్ట్రాల్లో ఏపీ మొదటి స్థానంలో ఉండడం ఆందోళనకలిగిస్తోందన్నారు. ఆహార పదార్థాల కల్తీని నిరోధించడంలో ఆహార భద్రత శాఖ అధికారులు విఫలం చెందుతున్నారన్నారు. ఆహార కల్తీ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపు తోందన్నారు. ఆహార పదార్థాలను తనిఖీ చేయడం, నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించేందుకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల కొరత ఉందన్నారు. కల్తీ నియంత్రణకు ఈ శాఖకు అవసరమైన సిబ్బంది భర్తీకి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నానాజీ కోరారు.

వర్గీకరణ ఓ రాజకీయ కుట్ర... శాంతియుత పోరాటం చేస్తా: ఆర్ఎస్ రత్నాకర్

కాకినాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా రాజకీయ కుట్రపూరితంగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణపై అంచలంచెలుగా ప్రజాస్వామ్య, శాంతియుత, అంబేడ్కర్ మార్గంలో పోరాడతామని రాక్స్, సర్వజనసమాజ్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ వెల్లండిచారు. ఎస్సీ వర్గీకరణపై మాట్లాడకుండా పదవులు అనుభవిస్తున్న ప్రజాప్రతినిధులు మరణించినట్టేనంటూ వారికి కొవ్వొత్తి వెలిగించి సంతాపం తెలిపారు. కాకినాడలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు తన రాజకీయ లబ్ధి కోసం ఈ వర్గీకరణకు మద్దతు పలుకుతున్నారన్నారు. దీని వెనుక ఉన్న కుట్ర తెలుసుకోకుండా వర్గీకరణకు ముందుకు రావడం విచారకరమన్నారు. దళిత జాతిపై జరుగుతున్న ఈ కుట్రను మాలలందరూ ఖండించాలన్నారు. ఒక్కసారి ఆలోచించి సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో నిరసనలు, ప్రజాస్వామ్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

కాగా వర్గీకరణ అంశంపై మాట్లాడేందుకు మాలలందరూ తరలిరావాలని రత్నాకర్ పిలుపు నేపథ్యంలో కాకినాడలోని ఇంద్రపాలెం వంతెనవద్ద, కలెక్టరేట్, పాతబస్టాండ్ అంబేడ్కర్ భవన్‌వద్ద భారీగా పోలీసులు మోహరించారు. కలెక్టరేట్ వద్దకు చేరుకున్న రత్నాకర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఇంద్రపాలెం వంతెన వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్



తహసీల్దారుకు లేఖ ఇస్తున్న వీఆర్వోలు

'క్లస్టర్ విధానాన్ని స్వాగతిస్తున్నాం'

సామర్లకోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రెండు సచివాలయలను కలిపి ఒక క్లస్టర్ చేసే మంచి ప్రక్రియను స్వాగతిస్తున్నామని కాకినాడ జిల్లా వీఆర్వోల సంఘ అధ్యక్షుడు ఎండీ ఖాదర్‌వల్లీ స్పష్టం చేశారు. బుధవారం ఆయన వీఆర్వోలు పద్మనాభం, చంద్రబాబు, ఏడుకొండలు, ప్రసాద్‌లతో కలిసి సామర్లకోట తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి లేఖ అందజేశారు.



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

పిఠాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ అయితా రాంబాబు కుటుంబసభ్యులకు రూ.99,553, కోన సత్యవతికి ఆరోగ్య ఖర్చుల నిమిత్తం రూ.1.55 లక్షలు మంజూరయ్యాయి. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ బుధవారం వారి ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేశారు. నాయకులు కొరుప్రోలు శ్రీను, నల్లా శ్రీను, మసకపల్లి రాజా, వియ్యపు రామన్నరాజు, పీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్‌లో సత్తా

ఆర్టీసీ డ్రైవర్‌కు మంత్రి అభినందన



కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న శ్రీనివాసరావు వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా చాటుతున్నాడు. బుధవారం ఆయన విజయవాడలోని సెక్రటేరియట్‌లో స్పోర్ట్స్ మినిస్టర్ రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఇండియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్, పంజాబ్‌లో జరిగిన జాతీయ పోటీల్లో మెడల్స్‌తో పాటు స్పోర్ట్స్‌లో దాదాపు 80 పతకాలు సాధించిన శ్రీనివాసరావును మంత్రి అభినందించారు. అతడికి కావాల్సిన అన్ని ఎక్విప్‌మెంట్స్, ప్రొవిజన్స్ అందిస్తామని చెప్పారు.

'క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి'

కాకినాడ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు మోసా అబ్రహం కోరారు. మంగళవారం ఆయన మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. క్రైస్తవుల సమస్యలపై ముఖ్యమంత్రితో భేటీ విషయమై చర్చించారు. త్వరలో గౌరవవేతనం విడుదలైన తర్వాత పాస్టర్లందరూ ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపే ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి రామయ్య స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు కె.మోజెస్‌కుమార్, జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.ప్రభాకర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు టీఎస్ రాజు, ఉద్యోగుల విభాగం కాకినాడ జిల్లా అధ్యక్షుడు కేఎస్ డేవిడ్‌రాజు, కాకినాడ సిటీ నాయకుడు నక్కా షాలెంరాజు పాల్గొన్నారు.



టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రామయ్యకు వినతిపత్రం ఇస్తున్న క్రిస్టియన్ కౌన్సిల్ సభ్యులు

'పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం'

పిఠాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం సాగిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు తెలిపారు. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించే ధర్నాలో పాల్గొనేందుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రానున్నారని చెప్పారు. ఆ రోజు కొమరగిరి జంక్షన్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ప్రదర్శన జరిపి అక్కడ ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, నియోజకవర్గ కార్యదర్శి సాకా రామకృష్ణ, కేశవరపు అప్పలరాజు, భవానీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు

'మాలలపై ప్రభుత్వం కుట్ర'

కరప, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో టీడీపీ ప్రభుత్వ వైఖరి దారుణమని, మాలలపై కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని కరప మండల అంబేడ్కర్ యువజన సేవా సంఘం నాయకులు విమర్శించారు. మాలమహానాడు నాయకుడు మాతా అప్పారావు, రచయిత సవిలే రాజేష్ బుధవారం కరపలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షలు ఉన్న మాదిగలకు 6.5శాతం రిజర్వేషన్లు, 35లక్షలు ఉన్న మాలలకు 7.5శాతం రిజర్వేషన్లు ప్రకటించడం కుట్ర కాదా అని ప్రశ్నించారు. వర్గీకరణ విషయంలో మాలలకు అన్యాయం జరుగుతుంటే టీడీపీలోని మాల ఎమ్మెల్యేలు సైతం స్వాగతించడం బాధాకరమన్నారు. 14ఏళ్ల కిందటి జనాభా లెక్కల ప్రాతిపదికన వర్గీకరణ చేయడమేమిటని ప్రశ్నించారు. నాయకులు చిన్నం వెంకటేశ్వరరావు, గుబ్బల రామకృష్ణ, పత్తిపాటి బుల్లిరాజు తదితరులు పాల్గొన్నారు.

దళిత నాయకులను అడ్డుకున్న పోలీసులు

సామర్లకోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ అచ్చంపేటలోని ఎమ్మెల్యే చినరాజప్ప ఇంటిని ముట్టడించేందుకు మాలల ఐక్య వేదిక నాయకులు లింగం శివప్రసాద్, సతీష్‌కుమార్ నాయకత్వంలో పలువురు కార్యకర్తలు ప్రదర్శనగా వచ్చారు. పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, సీఐ కృష్ణభగవాన్, పెద్దాపురం ఎస్ఐ మౌనిక వారిని అడ్డుకుని వెనుక్కు పంపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.



యాదవ, గౌడ కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

పిఠాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యాదవ, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్లను నియమించగా కాకినాడ జిల్లాకు చెందిన నలుగురికి అవకాశం లభించింది. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం కొడవలికి చెందిన నక్కా సత్యనారాయణమూర్తి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్లుగా మట్టా ప్రకాష్ గౌడ్ (కాకినాడ రూరల్ నియోజకవర్గం), బడుగు శ్రీకాంత్ (పెద్దాపురం), మట్టా మంగరాజు (కాకినాడ)లను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ బుధవారం రాత్రి జీవోలు జారీ చేసింది. వీరు రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు.

మహా సంస్థానం హుండీల ఆదాయం రూ.18.57 లక్షలు

పిఠాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలోని హుండీలను బుధవారం తెరిచి లెక్కించారు. 90 రోజులకు రూ.18,57,246 ఆదాయం లభించింది. లెక్కింపులో దేవదాయ శాఖ తనిఖీదారు వడ్డి ఫణీంద్రకుమార్, కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మాండవ్యనారాయణ స్వామి ఆలయంలో...

సామర్లకోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మాండవ్యనారాయణ స్వామి ఆలయంలోని హుండీలను బుధవారం తెరిచి లెక్కించారు. ఏడాదికి రూ.95,514 ఆదాయం వచ్చినట్టు ఈవో జోగా సత్యనారాయణ తెలిపారు. అర్చకులు చక్రవర్తుల రఘురామ్, వల్లూరి శ్రీధర్, కోరుమిల్లి జోగనటరాజ్, నేతి సత్యనారాయణ, నేతి కిషోర్ పాల్గొన్నారు.



ఆక్వా పరిశ్రమను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఆక్వా కేంద్రం పరిశీలన

తాళ్లరేవు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద బయోఫ్లాగ్ యూనిట్ ద్వారా కోరంగిలో వనామీ రొయ్యలు సాగు చేస్తున్న ఔత్సాహిక ఆక్వా కేంద్రాన్ని కలెక్టర్ షాన్ మోహన్ జిల్లా మత్స్య శాఖ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఆక్వా రైతు కోదూరి ఆదినారాయణతో మాట్లాడి బయోఫ్లాగ్ విధానం వివరాలను అడిగి తెలుసుకున్నారు. మత్స్య శాఖ అధికారి వి.కృష్ణారావు, ఎండీ ఎం.లావణ్య, ఎఫ్‌డీవో గోపి, తహసీల్దారు త్రినాథరావు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

క్యాలెండర్ ఆవిష్కరణ

పిఠాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత తెలుగు యుగాది క్యాలెండర్ (త్రైతశకం)లను శ్రీలంక బౌద్ధ భిక్షువు బౌధిహీస్‌తో కలిసి జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు బుధవారం ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి-ఇందూ జ్ఞాన వేదిక కాకినాడ శాఖ అధ్యక్షుడు ఎస్.అనిల్‌కుమార్, సభ్యులు నాగేశ్వరరావు, సూర్యలక్ష్మి, సాయి తదితరులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం వర్ధంతి

పిఠాపురం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతు విప్లవ పోరాటంలో కీలకపాత్ర పోషించిన మల్లు స్వరాజ్యం తృతీయ వర్ధంతిని పిఠాపురం మండలం మంగితుర్తిలో బుధవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ, ప్రజా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం, గురాల ప్రసాద్, మామిడి ఏసుబాబు, డెక్కల లాజరు, అన్నవరం, అచ్చియమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

'పాడా' పీడీ పర్యటన

కొత్తపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణక్కపేట, మూలపేట గ్రామాల్లో పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) ప్రాజెక్టు డైరెక్టర్ చైతన్యవర్షిణి బుధవారం పర్యటించారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో పాఠశాలల్లో నిర్మించిన ప్రహరీలను ఆమె పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏపీడీ పి.వసంతమాధవి, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్కిల్ ఇంటర్నేషనల్ కెరీర్‌పై అవగాహన

కాకినాడ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్య నర్సింగ్ కాలేజీలో అంతర్జాతీయ నైపుణ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జర్మనీ క్లయింట్ విక్టోరియా జర్మనీలో ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, భవిత అభివృద్ధి, వైద్య, ఆరోగ్య రక్షణ తదితర కెరీర్‌కు చెందిన విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్కిల్-టీ ఉజ్వల, ఏడీ స్కిల్ బి.నేహ, ఆదిత్య నర్సింగ్ కాలేజీ డైరెక్టర్ ఎన్.సుగుణారెడ్డి, కాలేజీ ఏడీ ఎస్‌డీఏ కె.యశోదకృష్ణ, ఎస్‌డీసీ వైపీ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణా తరగతులు

ప్రత్తిపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు 3రోజులు పాటు అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో అరుణ శ్రీ తెలిపారు. ఏలేశ్వరం ఎంపీడీవో కార్యాలయం వద్ద 70 మంది అంగన్‌వాడీ వర్కర్లకు నవ చేతన ఆదర్శ శీల కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీల్లో విద్యా నాణ్యతను మెరుగుపరిచేందుకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

డ్వాక్రా రుణాల అవకతవకలపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న వెలుగు ఏపీఎం, సిబ్బంది

రాజవొమ్మంగి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తంటికొండ పంచాయతీ వట్టిగడ్డ గ్రామానికి చెందిన 33డ్వాక్రా గ్రూపులకు 15డ్వాక్రా గ్రూపుల్లో యూనియన్ బ్యాంక్ ద్వారా రుణాలు మంజూరుచేసి తిరిగి తీసేసిన సంఘటన తెలిసిందే. బుధవారం దీనిపై వెలుగు ఏపీఎం రామాంజనేయులు, సీసీలు, ఎంఎంఎస్ లీడర్లు ఆధ్వర్యంలో వట్టిగడ్డ డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. దీనిపై విచారణ చేపట్టగా ఎటువంటి అనుమతులు, తీర్మానాలు లేకుండా బ్యాంకులో రుణాలు మంజూరుచేసి డ్వాక్రా సంఘాల ఖాతాల్లో నగదు జమ చేయడం, తిరిగి తీసేయడం వంటి అవకతవకలు జరిగినట్టు గుర్తించినట్లు ఏపీఎం తెలిపారు. గ్రూపు సభ్యులకు తెలియకుండా రూ.2కోట్ల62 లక్షల98వేలు లావాదేవీలు జరిగినట్లు గుర్తించామన్నారు. దీంతో 15గ్రూపులకు రూ.51వేలు వడ్డీ పడిందన్నారు. ఈఅవకతవకలకు బ్యాంకు మేనేజర్‌కు వీవో లీడర్లు సపోర్టు చేసినట్లు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వీవో లీడర్‌ని తొలగించాలని డ్వాక్రా మహిళలు వెలుగు అధికారులను కోరారు.

ఏజెన్సీలో బాల్య వివాహాలు నిర్మూలించాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో బాల్య వివాహాలు నిర్మూలించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సబ్‌కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు వల్ల జరిగే అనర్థాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తహశీల్దార్లు సీహెచ్ శ్రీనివాసరావు, వేణుగోపాల్, కె.సూర్యనారాయణ, కరక సత్య నారాయణ, ఎంపీడీవోలు సుండం శ్రీనివాస్ దొర, మడకం బాపన్నదొర, యాదగిరి ఈశ్వ రరావు, మండల విద్యాశాఖాధికారులు రామ కృష్ణ, బాపన్నదొర, తాతి అబ్బాయిదొర, ముత్యాలరావు, వై.వెంకన్న, పి.శ్రీనివాసరావు, టి.సూరారెడ్డి పాల్గొన్నారు.

'న్యాయం చేయాలని వినతి'

చింతూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తనకు జరిగిన అన్యాయంపై రెండేళ్లుగా పోరాడుతున్నప్పటికీ ఎటువంటి న్యాయం జరగలేదని ఇప్పటికైనా తనకు న్యాయం చేయాలని వేంపాటి పద్మ ప్రాధేయపడుతున్నారు. వరరామచంద్రపురం మండలం రేఖపల్లికి చెందిన వేంపాటి పద్మ బుధవారం చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్‌కు తనకు జరిగిన అన్యాయంపై వినతి పత్రం అందజేశారు. 15ఏళ్లుగా డ్వాక్రా గ్రూప్ సభ్యురాలిగా కొనసాగానన్నారు. రెండేళ్ల క్రితం ఎటువంటి తీర్మానం చేయకుండానే తన సంతకం ఫోర్జరీచేసి మిగిలిన సభ్యులు పొదుపు ఖాతాలోని సొమ్ములను డ్రా చేసుకున్నట్లు పద్మ ఆరోపించారు. ఈవిషయమై తాను ప్రశ్నించినందుకు తనను గ్రూప్ నుంచి తొలగించినట్లు పద్మ పేర్కొన్నారు. ఇప్పటికీ పలుమార్లు ఐటీడీఏ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో పాటు పోలీసుస్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

మారేడుమిల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై రైతులకు వ్యవసాయ పనిముట్లను అందించనున్నట్లు మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు 50శాతం రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేసేందుకు దరఖాస్తులు చేసుకోవాలని రైతులకు తెలిపారు. వివరాలకు వ్యవసాయశాఖ అధికారి ఫోన్ నెంబరు 8331056625లో సంప్రదించాలని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీ పోను మిగతా సొమ్ములను రైతులే పూర్తిగా చెల్లించాలన్నారు. యంత్ర పరికరాలు కావాల్సిన గిరిజన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్‌ల జిరాక్స్‌లు, బ్యాంక్‌లింక్ మొబైల్ నెంబర్‌తో రైతు సేవాకేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

యువత మంచి మార్గాలవైపు నడవాలి

వై.రామవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాల వైపు దృష్టి సారించకుండా యువత మంచి మార్గాలవైపు అడుగులు వేయాలని అడ్డతీగల సీఐ నరసింహమూర్తి సూచించారు. బుధవారం కోట గ్రామంలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. చిన్నపిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి రవాణా, గంజాయి వినియోగం, నాటుసారా విక్రయాలు, సైబర్ నేరాల జోలికి వెళ్లవద్దని సూచించారు. డ్రైవింగ్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఎస్ఐ రామకృష్ణ, ట్రైనింగ్ ఎస్ఐలు సురేష్, చక్రదొర పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసరాల కిట్లు పంపిణీ

కూనవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూళ్లపాడు గ్రామంలో ఏఎస్‌డీఎస్ ఫౌండేషన్ ద్వారా 137కుటుంబాలకు రూ.వెయ్యి విలువైన నిత్యావసరాల కిట్లను టీడీపీ అరకు పార్లమెంటు తెలుగు యువత ప్రతినిధి గడేసుల రంజిత్‌కుమార్ అందించారు. కూళ్లపాడు గ్రామంలో మా ఊరు శుభ్రత అనే కార్యక్రమంలో భాగంగా ప్రజలు శ్రమదానం ద్వారా గ్రామంలోని డ్రైనేజీలు, కాలువలను శుభ్రం చేశారు. 137కుటుంబాలకు నితావ్యసరాలు, దుస్తులు, బెడ్‌షీట్స్ ఇచ్చిన ఏఎస్‌డీఎస్ ఫౌండర్ ఉండవల్లి గాంధీబాబుకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌డీఎస్ కోఆర్డినేటర్ నిరుపతి రవి, తెలుగు యువత నాయకులు గీగా రామారావు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సీతపల్లి గడి బాపనమ్మ మహోత్సవ క్యాలెండర్ ఆవిష్కరణ



రంపచోడవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సీతపల్లి గడి బాపనమ్మ అమ్మవారి మహోత్సవ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి బుధవారం ఆవిష్కరించారు. మహోత్సవాలు ఈనెల25నుంచి 29వరకు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యరమేష్ తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పండా బాబీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

రంపచోడవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. బుధవారం ఆయన రంప అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం చిన్నారులతో ఐటీడీఏ పీవో ముచ్చటించారు. గర్భిణులు, బాలికలకు రక్తహీనత లేమి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

వై.రామవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కోట గ్రామంలో బుధవారం గ్రామస్తులు మావోయిస్టుల విధి విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. అభివృద్ధిని అడ్డుకుంటున్నది మావోయిస్టులేనని, సెల్ టవర్లు రాకూడదని, సెల్‌ఫోన్లు మాట్లాడకూడదని బెదిరించి భయపెడుతున్నది మావోయిస్టులేనని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు.



సునీతా విలియమ్స్ చేరికను వీక్షించిన విద్యార్థులు

రాజవొమ్మంగి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఐఎస్ఎస్‌లో చిక్కుకుని తొమ్మిది నెలల తర్వాత బుధవారం తిరిగి భూమిని చేరుకుంటున్న సునీత విలయమ్స్ వీడియోను మండలంలో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులు వీక్షించారు. సునీత విలియమ్స్ ఎందుకు అంతరిక్షంలోకి వెళ్లింది, అక్కడి పరిస్థితులు వివరించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

మోతుగూడెం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రంలో మంగళవారం రాత్రి సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేసినట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

వాహనాల తనిఖీ

దేవీపట్నం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేట రహదారిలో బుధవారం ఎస్ఐ షరీఫ్ వాహనాలను తనిఖీ చేశారు. కార్లు, బైక్‌లు వివిధ వాహనాలు నిలుపుదల చేసి రికార్డులు పరిశీలించారు. నూతన రోడ్డు భద్రతా చట్టాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

- ఆరు నెలలుగా నిలిచిపోయిన రహదారి నిర్మాణ పనులు
- మధ్యలోనే వదిలేసిన పైపులైన్ నిర్మాణ పనులు
- వేలాడుతున్న విద్యుత్ వైర్లు
- ఇబ్బందుల్లో బవురువాక గ్రామస్థులు



అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన రహదారి, పైప్‌లైన్

ప్రత్తిపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బవురువాక గ్రామంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పలు పనులతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన మంత్రి సడక్ యోజన పథకంలో భాగంగా నిర్మిస్తున్న రహదారి నిర్మాణ పనులను ఆరు నెలలుగా వదిలివేయడం వల్ల దుమ్ము, ధూళి గాలికిలేచిపోయి గ్రామాన్ని కమ్మేస్తున్నాయి. అలాగే శరభవరం నుంచి బవురువాక వాగు వరకు సుమారు రూ.4.71 కోట్ల వ్యయంతో నిర్మించే ఈ రహదారి పనులు అసంపూర్తిగా ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో విద్యుత్ వైర్లు వేలాడుతుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల గ్రామం మీదుగా ఆంధ్ర శబరిమలై వెళ్తున్న టూరిస్టు బస్ విద్యుత్ షాక్‌కు గురవడంతో పలువురు గాయపడ్డారు. ఇదిలా ఉంటే గ్రామంలోని జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా పైపులైన్‌లు అసంపూర్తిగా నిర్మించి వదిలివేశారు. దీని వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి బవురువాకలో సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పేద ఆడబిడ్డలకు 'పెళ్లి కానుక'



పెళ్లి కానుక అందజేస్తున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పేద ఆడబిడ్డ పెళ్లి చేసుకుంటే రూ.20 వేలు పెళ్లి కానుక జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా అందిస్తానని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ గత ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. నెల రోజులుగా 72 వివాహాలు జరిపించగా వారందరికీ బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నూతన వధువరులందరికీ రూ.20వేలు చొప్పున రూ.14,40,00 అందించారు. నియోజకవర్గంలో ఆధార్ కార్డు కలిగి ఉండి, అమ్మాయికి 18ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు పూర్తయి ఉండా లని, పెళ్లికి పదిరోజులు ముందు నెహ్రూ ఫౌండేషన్ కార్యాలయం లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు, చదరం చంటిబాబు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, అడబాల వెంకటేశ్వరరావు, పాఠంశెట్టి రవి, బొల్లంరెడ్డి రామకృష్ణ, పాఠంశెట్టి మురళీకృష్ణ, పోతబత్తుల శ్రీను పాల్గొన్నారు.

ముద్రగడ, మురళీరాజు పరామర్శలు

ప్రత్తిపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో పలు బాధిత కుటుంబాలను బుధవారం నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు వేర్వేరుగా పరామర్శించారు. స్థానిక పశువుల ఆసుపత్రి సమీపంలో నివాసం ఉంటున్న ధ్యాన మండలి అధ్యక్షుడు దొడ్డిపట్ల సోమన్న దొరను ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. సోమన్న దొర గుండె శస్త్రచికిత్స చేయించుకోవడంతో ముద్రగడ గిరిబాబు, ఎంపీపీ గోళ్ళ సుధాకర్, బెహరాదొరబాబు, జువ్వల బాబులు గిరిబాబుతో కలిసి పరామర్శించారు. అలాగే ముదునూరి మురళీకృష్ణంరాజు గ్రామంలోని దాసరి ధర్మరాజు ఇటీవల ఆకస్మికంగా మృతిచెందడంతో ఆ కుటుంబీకులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, గుమ్మడి రామకృష్ణ, నానిపల్లి రమణ, బాబ్జి, రాజా తదితరులు ఉన్నారు.

పది పరీక్షల్లో డ్రోన్ కెమెరాతో నిఘా



ధర్మవరం హైస్కూల్లో డ్రోన్‌తో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రత్తిపాడు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాలతో బందోబస్తు చేపట్టారు. ధర్మవరం, లంపకలోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం డ్రోన్ కెమెరా ఏర్పాటు చేసి బుధవారం బందోబస్తు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం మండలంలో నిర్వహించిన టెన్త్ హిందీ పరీక్షకు 13 మంది గైర్హాజరైనట్టు ఎంపీవో వి.రాజబాబు తెలిపారు.

ఏడుగురు గైర్హాజరు

గండేపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో పదోతరగతి పరీక్షలు రెండోరోజు బుధ వారం ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈవో నాయక్ తెలిపారు. బుధవారం 492 మందికి 485మంది విద్యార్థులు హాజరుకాగా ఏడుగురు గైర్హాజరయ్యారన్నారు. గండేపల్లి, మల్లేపల్లి, తాళ్ళూరు సెంటర్లను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు తనిఖీ చేశామన్నారు.

ధాన్యం నాణ్యతపై అవగాహన అవసరం

శంఖవరం, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ధాన్యం నాణ్యత ప్రమాణాలపై సిబ్బందికి అవగాహన ఉండాలని జిల్లా పౌర సరఫరా శాఖ సాంకేతిక సహాయకుడు దుర్గాప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు, రైతుసేవా కేంద్రం, వీఆర్వోలకు ధాన్యం కొనుగోలు రబీ 2024-25పై శిక్షణ నిర్వహించారు. దుర్గాప్రసాద్ శిక్షణను ఉద్దేశించి మాట్లాడుతూ ముందుగా సిబ్బందికి నాణ్యత ప్రమాణాలు, నమూనాల సేకరణ, వాహనాల రిజిష్ట్రేషన్, నియంత్రణ, కస్టోడియన్ అధికారి విధులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. నెల్లిపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు గాంధీ, శ్రీనివాస్, మౌళి, ప్రసాద్ పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూసారం పెంపు

తొండంగి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): భూసారం పెంపునకు నవధాన్యల సాగు మేలు చేస్తుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ గోవిందరాజులు అన్నారు. బుధవారం సీతారాంపురం, శృంగవృక్షం యూనిట్ల పరిధిలో నవధాన్యాల కిట్లను తయారు చేశారు. సంవత్సరం అంతా భూమి పచ్చగా ఉంచేందుకు రబీ కోతల అనంతరం నవరత్న విత్తనాలను సాగు చేస్తే ఖరీఫ్ నాటికి భూసారం పెరుగుతుందన్నారు. నవధాన్యాలతో కిట్లను సిద్ధపరిచామన్నారు. ఎకరాకు 12 కిలోల విత్తనాలు అవసరమవుతాయని, తక్కువ ధరకు రైతులకు అందుబాటు ధరలో అందిస్తున్నామన్నారు. దేవి, పులి సంధ్య, ములికి రాంబాబు, గణేష్ ఉన్నారు.

'శివాలయాలను అభివృద్ధి చేస్తాం'

అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు

శంఖవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): శంఖవరంలో అన్నవరం దేవస్థానం కళ్యాణ మండపం, దత్తద దేవాలయమైన శివాలయాలను అభివృద్ధి చేస్తామని అన్నవరం ఈవో సుబ్బారావు అన్నారు. బుధవారం టీడీపీ నేత పర్వత సురేష్ అభ్యర్థన మేరకు కళ్యాణమండపాన్ని పరిశీలించిన ఆయన శిథిలావస్థలో ఉండటాన్ని గుర్తించారు. దీనికి వెంటనే అంచనాలు వేసి వెంటనే నిధులు మంజూరయ్యేలా కృషి చేశామని, అదేవిధంగా సత్యదేవుని దేవస్థానం దత్తత దేవాలయమైన శివాలయం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అవార్డు

అన్నవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడిగా సేవలందించడంతో పాటుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో తనవంతు సహాయసహకారాలు అందింస్తున్న డాక్టర్ బెనబాబుకు ముంబాయికి చెందిన రైసింగ్ స్టార్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు అవార్డు లభించింది.

బయోమెట్రిక్ డివైజ్‌ల అందజేత

గండేపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సచివాలయ వ్యవస్థ ద్వారా వివిధ పథకాలకు సంబంధించి, పింఛన్ల పంపిణీలో లబ్ధిదారుల బయోమెట్రిక్ త్వరితగతిన పూర్తిచేసేందుకు 143 మంత్ర ఎల్1 బయోమెట్రిక్ డివైజ్‌లను బుధవారం ఎంపీడీవో నాతి బుజ్జి పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. వీటిని పథకాల పంపిణీ, వివిధ రకాల సర్వేలకు ఉపయోగించాలన్నారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సారా తయారీకి బెల్లం అమ్మడం నేరం



తుని రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తుని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బెల్లం విక్రయాలు నిర్వహిస్తున్న వర్తకులతో సీఐ పట్టాభి చౌదరి సమావేశం నిర్వహించారు. సారా కాసే వారికి బెల్లం అమ్మడం నేరమని తెలిపారు. బెల్లం బల్క్‌గా కొనుగోలు దారులు వివరాలు ఉంటే ఎక్సైజ్ పోలీసులు సమాచారం అందించాలనిగ్రామాల్లో సారా విక్రయాలు పూర్తిస్థాయిలో అరికట్టేందుకు వర్తకులు సహాయం అవసరం అన్నారు.

తుని పట్టణాభివృద్ధికి రూ.3 కోట్లు: దివ్య



తుని రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తుని పట్టణాభివృద్ధికి ప్రభుత్వం రూ.3కోట్లు నిధులు విడుదల చేసిందని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు నిధులతో పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రభుత్వం మరో రూ.3 కోట్లు నిధులు విడుదల చేసిందన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా ఈ నిధులను కేటాయించి అభివృద్ధి పనులు చేపడతామని ఆమె పేర్కొన్నారు.

బీజేపీ కిర్లంపూడి అధ్యక్షుడిగా రాజబాబు



కిర్లంపూడి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండలాధ్యక్షుడిగా మండలంలో జగపతినగరం గ్రామానికి చెందిన శరకణం రాజబాబు ఎన్నికయ్యారు. పార్టీ అధిష్టానం బుధవారం ఉత్తర్వులు జారీ చేయడంతో రాజబాబుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

పోక్సో చట్టంపై మహిళలకు అవగాహన



వెలుగు కార్యాలయంలో వీవోఏలకు అవగాహన సదస్సు

కిర్లంపూడి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై మహిళలకు అవగాహన సదస్సును కిర్లంపూడి వెలుగు కార్యాలయంలో ఏపీఎం వేదకుమారి ఆధ్వర్యాన బుధవారం నిర్వహించారు. పడాల చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ కె.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. డీఆర్‌డీఏ ఎహెచ్‌డి యాంకర్ పర్సన్ జి.అనిల్‌కుమార్ హాజరయ్యారు. సీసీ బుల్లియ్య, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వైసీపీ నాయకుడి మృతి

తునిరూరల్, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కుసనం దొరబాబు(50) మృతి చెందారు. వ్యక్తిగత పనులపై తాడేపల్లిగూడేనికి వెళ్లిన ఆయన బుధవారం తెల్లవారుజామున తునిలో రైలు దిగి ద్విచక్రవాహనంపై స్వగృహానికి వెళ్లే క్రమంలో అదే గ్రామంలో వీధి కుక్కలు వెంట పడడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కన ఉన్న స్తంభాన్ని ద్విచక్ర వాహనంతో ఢీకొన్నాడు. తీవ్రగాయాల పాలై మృతి చెందాడు. ఆయన మృతితో ఎస్.అన్నవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఘనంగా టీడీపీ మండలాధ్యక్షుడి పుట్టినరోజు

కోటనందూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోటనందూరు మండలాధ్యక్షుడు గాడిరాజుబాబు పుట్టిన రోజు వేడుకలు మాజీ ఎంపీపీ డి.చిరంజీవిరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అంకంరెడ్డిరమేష్ వెలగా వెంకటకృష్ణారావు, చింతకాయల రవికుమార్, లగుడు సత్యనారాయణమూర్తి, పోతల సూరిబాబు, బోడపాటిసత్యనారాయణ, యర్ర చినసత్యనారాయణ, మాతిరెడ్డిబాస్కరరావు, గెడ్డంకొండయ్యనాయుడు, అంకంరెడ్డిబుల్లిబాబు, సామినీడి కృష్ణార్జున, చిటికెల సత్యనారాయణ ఉన్నారు.

ధర్మవరంలో రూ.56లక్షలతో పైపులైన్ విస్తరణ



ధర్మవరంలో వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో కుమార్‌బాబు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రత్తిపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.56లక్షల అంచనాలతో పైపులైన్‌లు విస్తరించేందుకు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు బుధవారం కలెక్టర్‌కి నివేదిక పంపారు. ఈనెల 17న ధర్మవరంలో దాహం..దాహం.. అంటూ ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం వెలువడిన నేపథ్యంలో ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు ఆ గ్రామం సందర్శించి తాగునీటి ఎద్దడి నివారణకు పైపులైన్ విస్తరణ చేపట్టాల్సిన ఆవశ్యకతను గుర్తించారు. ఇందు కోసం రూ.56లక్షలతో అంచనాలతో కూడిన నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు నివేదించినట్లు తెలిపారు.

కూటమిలో సుపరిపాలన

మురారి ఉపసర్పంచ్ వసంత్

గండేపల్లి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే వందశాతం అభివృద్ధి పనులు పూర్తి చేసే విధంగా పరిపాలన ఉందని మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్ అన్నారు. బుధవారం మండలంలోని మురారిలో కూటమి నాయకులు, కార్యకర్తలులతో సమావేశం నిర్వహించారు. వసంత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన అభివృద్ధి పనులు వివరించారు. రాబోయే కాలంలో మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ వందశాతం అమలు చేసేవిధంగా పనిచేస్తామన్నారు.

పి4సర్వే పూర్తి

తుని ఎంపీడీవో సాయినవీన్

తుని రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 సర్వే తుని మండలంలో పంచాయతీ, సచివాలయ సిబ్బంది సహకారంతో నూరు శాతం పూర్తి చేయగలిగామని తుని ఎంపీడీవో సాయినవీన్ స్పష్టం చేశారు. మండలంలో ఉన్న 25,613మంది హౌస్ హోల్డర్స్‌ని సర్వే చేయగా అందులో 93శాతం పిఫోర్ సర్వేకు సహకరించారన్నారు. సర్వేలో నమోదు చేయబడిన పేర్లు, గ్రామసభల ద్వారా ధ్రువీకరించి ప్రభుత్వ ఆదేశాల మేరకు పి4 అమలు చేయనున్నట్లు తెలిపారు.

'తుమ్మలపల్లి' పరామర్శ



జగ్గంపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం గుర్రప్పాలెం పంచాయతీ నగర పేట గ్రామానికి చెందిన నక్క వీర వెంకటరమణ ఇటీవల మృతిచెండంతో బుధవారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జగ్గంపేట మండలాధ్యక్షులు మరిసే రామకృష్ణ, గండం శ్రీనివాస్,మాదారపు వీరబాబు, రాజనాల శ్రీను, సూరపరెడ్డి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు

జగ్గంపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న ఆంజనేయ స్వామి గుడి వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన సంతర్పణ కార్యక్రమం జరిగాయి. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. కొత్త కొండబాబు, పీటీ ప్రసాద్, రాజనాల శ్రీను, మాదారపు వీరబాబు, నరేష్ పాల్గొన్నారు.

మజ్జిగ వితరణ

జగ్గంపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డిస్ట్రిక్ వీ210ఏ వాసవి క్లబ్ ద్వారా దారా శ్రీనివాస్, శ్రీలక్ష్మి దంపతులు పెళ్లి రోజు సందర్భంగా మజ్జిగ వితరణ చేశారు. వీ110ఏ గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, డిస్ట్రిక్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కొత్త కొండబాబు, జోన్ చైర్మన్ పొట్టి వీర్రాజు, ప్రెసిడెంట్ మానేపల్లి రామానుజ, బీటెక్ క్లబ్ ప్రెసిడెంట్ బొండ అయ్యప్ప, సెక్రటరీస్ మాతంశెట్టి నారాయణ, లావణ్య,ఉద్దగిరి కామేష్, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.